


# ఆమె తుదినిర్ణయం

టి. జగన్నివాస రావు

ఆమె కన్నులలో అందము, అందాన్ని మించిన ప్రతిభ గోచరిస్తుండేవి. చిన్నతనంలోనే ఆమె లేతముఖంలో ఒక విచిత్రమైన శక్తి అణగి ఉండేది. ఆశక్తే ఆమె పెద్దయిన తర్వాత అపూర్వమైన వ్యక్తిత్వానికి కారణమైనది. త్వరలోనే అనేకమంది సౌందర్యపిపాసువుల తీక్ష్ణ పరిశీలనకు ఆమె గురి అయింది. అందులో ఏ కొద్దిమంది మాత్రమో ఆమెలో వుండే స్వాతంత్ర్యేచ్ఛను గుర్తించగలిగేవారు. వారుగూడ కేవలం సౌందర్యం అనుభవించాలనే భ్రమతో ఆమెలో తమ కయిష్టమైన గుణములున్నవని ఎప్పుడు ఆలోచించేవారు కారు. ఆలోచించాలనే ఇష్టంగూడ వారికి ఉండేది కాదు.

వేసవికాలం అప్పుడే తీవ్రంగా పరిణమిస్తోంది. ప్రతిసంవత్సరము ఏ జూన్ నెలలోనో శీతల స్థలానికి వెళ్తుండేది. ఆమెకు ప్రపంచంలో ఏవిధమైన లోటులేదని ఆమెను గురించి తెలిసినవారి అభిప్రాయం. ఆమెకు తెలియనిరోజుల్లో తల్లి చనిపోయింది. తండ్రిని ఇంకా మరచిపోలేదు. కాన్వెంటుస్కూలు, కళాశాలా విద్యాభ్యాసము అసాధారణమైన మానసికశిక్షణను కలిగించాయి. తన స్థితిని చూసి విచారించేదికాదు. సాహసం జీవితంలో ప్రధానకర్తవ్యంగా యెంచింది. విశాలమైన ప్రపంచములో ఏవ్యక్తికైనా జీవితసౌఖ్యానికి అనంతమైన అవకాశములున్నాయనుకుంది. సాధించలేని సమస్య ఉండకూడదనే నిశ్చయంతో ఒంటరిజీవితాన్ని గడుపుతోంది.

ఏప్రియల్ నెలలో ఒక సాయంత్రం ఆమె మామూలు కార్యక్రమానికి అడ్డుతలిగింది. ఏదో ఆలోచనలో నిమగ్నమైఉంది. ఆనాడు ఇంట్లో నుంచి బయటకురాలేదు. తోటమాలి తెచ్చిన పూలన్నీ గుత్తులు గుత్తులుగానే పడివున్నాయి. క్లబ్బులో స్నేహితులందర్నీ చూడకుండా ఒక్కనాడు ఇంటికి వచ్చేదికాదు. అర్థంకాని స్థితిలో ఉంది. ఆనాటి అనుభవం అంతవరకు ఎప్పుడూ కలగలేదు.

ఆరోజు సాయంత్రం ఆమె క్లబ్బుకు వెళ్లేముందు జరిగింది ఒక సంఘటన. ఆ వూరిలో క్రొత్తగా వచ్చిన డాక్టరుతో ఆమెకు పరిచయం స్నేహంగా మారింది. సందేహాలు లేని మనస్సులతో ఇద్దరు ఒకరినొకరు మెచ్చుకొనేవారు. అనేక విషయాలను చర్చించుకొనేవారు. ఊరిలోని వారందరు వీరి వివాహముకొరకు ఎదురు చూస్తూండేవారు. ఆ సాయంత్రం డాక్టరు రావటం చూసి క్లబ్బుకు వెళ్ళటం మానేసింది. పోర్టికోలోనే కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. అనుకోకుండా డాక్టరు వివాహం గురించి తనకు తెలిసిన ఉద్దేశాలను ఏకరువు పెట్టున్నాడు.

'వివాహంయొక్క ముఖ్య ఉద్దేశము స్త్రీకి పురుషుడు అండగా వుండటం...అని నా నమ్మకం' అన్నాడు.

'ఏమో! నా జీవితం నాకే విచిత్రంగా ఉంటుంది. ఇంతవరకు ఒంటరి జీవితం నాకు కష్టం అనిపించలేదు. అలాంటి భయంకూడలేదు. కాని యితర స్త్రీలనుచూసినప్పుడు మాత్రం నా అనుభవాలు అనేకం చెదరిపోతాయి. నేను మాత్రం మీరు చెప్పిన లక్ష్యంకోసం మాత్రమే వివాహం చేసుకోను......'

అని ఎంతో భారంతో చెప్పింది.


ఇంకా ఏమేమో మాట్లాడుతున్నారు. కాని డాక్టరు మాటలు ఆమె వ్యక్తిత్వాన్ని అణచివేశాయి. ఇంక అతనికి తన ముఖంలోని దౌర్బల్యాన్ని చూపించలేక ఇంట్లోకి వెళ్లిపోయింది. ఎంతో కాలంనుంచివున్న పరిచయం, ప్రేమ త్రెంచుకోటం కష్టమని తెలిసినా, స్త్రీజాతికి అతనుచూపిన అగౌరవాన్ని సహించలేకపోయింది. అతనంటే యిష్టమే. కాని అతని ఉద్దేశాలని అంగీకరించటం జీవితంలో ఒకపెద్ద పొరబాటు చేయటంగా తలచింది.

అతనికి ప్రతిక్రియచేయాలని పట్టుదల ఆ క్షణంలోనే కలిగింది. ఎవ్వరూ అనుకోలేదు. ఆ సాయంత్రమే ఆ వూరు వదలాలనిపించింది.

* * *

ఆమె పినతండ్రి రిటైరయిన ఆఫీసరు. ఎప్పుడూ ఉదకమండలంలోనే నివాసం. ప్రతి వేసంగిలో నళినిని ఆహ్వానించటం అలవాటు, కానీ ఆ సంవత్సరం మేనెల రాక పూర్వమే ఆమె బయలుదేరి రావటం అతనికి ఆశ్చర్యంగావున్నా, సంతోషమాత్రం ఎక్కువయింది. ఎంతో ఆప్యాయంగా స్టేషనులో ఆమెను కలుసుకొని ఇంటికి తీసుకొని వచ్చాడు. కారులో వస్తున్నంతసేపు అతని ఆలోచనలు ఆమెను గూర్చే. తాను నెరవేర్చవలసిన విధి ఒకటుందని చాలాసార్లు అనుకొనేవాడు. ఆ వేసవిలో ఆమెకు వివాహం చేయాలని నిశ్చయించుకున్నాడు.

నళిని వచ్చినప్పటినుండి అతని ఇంట్లో పండుగలా వుండేది. సాయంత్రం క్లబ్బులో నళినిని తన మిత్రులకు పరిచయంచెయ్యడం అతనికి ఎంతో గర్వంగా వుండేది. త్వరలోనే నళినిగూడ అతని స్నేహితులతో కలసిమెలసి ఉంటూ, అన్ని విషయాలనుగురించి చర్చిస్తూ ఉండేది. రంగాపురం గురించి అక్కడవున్న డాక్టరు గురించి తలచుట మానేసింది. మరచిపోయిందికూడా. ఆమెకు కావలసింది అదే. తన పినతండ్రి స్నేహితులలో ఒక జమీందారు కుమారుడు



ఉన్నాడు. ఇతర ధనికులవలెనేఎప్పుడూ ఊటీలోనే హోటళ్ళలోజీవిస్తుంటాడు. వయస్సు ముప్పది సంవత్సరాలు.అందంగా వుంటాడు. అతనిని రావుసాహేబ్ అని పిలుస్తుంటూ రక్కడ. నళినికి అతనితో

స్నేహం అవటానికి అట్టే కాలం పట్టలేదు. ఆమె పినతండ్రికికూడా వారిరువురిని ఒక ఇంటివారినిగా చేయాలని అభిలాష.

చాలా రోజులవరకు నళినికి రావుసాహెబ్‌ను గురించి ఏవిధమైన అభిప్రాయము కలుగుట కవకాశం లేకపోయింది. అతనుమాత్రం నీలగిరిలో వేసవికాలంలో ఎంతో చల్లగా వుంటుందని మంచులో మసకగా కనిపిస్తూండే చంద్రుని వంక చూస్తూ ఎప్పుడూ ఒకే రకమైన ఆనందాన్ని పొందుతూ వుండేవాడు. ఆమె ఏవైనా ప్రశ్నలు వేస్తూంటే తన జీవితంలో ప్రశ్నలు సమస్యలు లేవన్నటు ఆమె ముఖంలోకి చూస్తూండేవాడు. అతనిని గురించి తెలిసిన విషయం ఒక్కటే ఆమెకు. అతనికి తన అందం తప్పయింకేమీ అక్కరలేదని.

ఒకనాడు సాయంత్రం టీ టేబులువద్ద కూర్చున్నారు. అతనికి టీ కలిపి యిచ్చింది. ఏదో ఇంగ్లీషుబొమ్మల పుస్తకం తిరగవేస్తూ త్రాగుతున్నాడు. నళిని తన కప్పులో టీని చెంచాతో కలుపుతూ చూస్తోంది. టీ యింకా త్రాగలేదేమని అతను అడిగేవరకు ఆమె ఏదో ఆలోచిస్తోంది. తొందరగా కప్పు ఎత్తటంలో చేయి జారి టీ అంతా ఒలికింది.

'అరె ..నీకు టీ లేదే' అని అతని నోటినుండి అప్రయత్నంగా వెలువడింది.

'అవును. నా జీవితంలో అనుకున్న వేవీ నాకు రాలేదు' అందామె.

'చిన్నప్పటినుండి కష్టాలే అనుకుంటూ నీకు' అన్నాడు.

'నిజమే. కాని నా అనుభవాలే క్రొత్త ఆశయాలను కల్పించి క్రొత్త కష్టాలను తెప్పిస్తాయి.'

ఈ ధోరణి అతనికి విచిత్రంగా కన్పించింది. అతని కామెను చూసినప్పుడల్లా అందమైనదని పొగడాలని వుంటుంది. ఆ ప్రసక్తివచ్చినా ఆమె మామూలుగావుండేది. ఆమెను ఏవిధంగా సంతృప్తిపరచగలనా అని అతనివేదన. తానామెను ఆకర్షించగలిగినందుకు తనప్రేమనుతానే అభినందించుకొంటూ వుండేవాడు.

ఆసాయంత్రం వాళ్ళిద్దరు ఒక చిన్న విషయం గురించి ఘర్షణ పడ్డారు.కొన్నిరోజులు గడచాయి. ఇద్దరూ అన్యోన్యంగా వుండేవారు. ఆమెను యే లోకంలోనుంచో వచ్చిన దేవకాంతలాగ చూసేవాడతను.

కాని అతనిపై ప్రేమ ఎక్కువైనకొద్దీ అతనంటే నూతనసందేహాలు కలుగుతూండేవి ఆమెకు. అతనికి తనంటే ఇష్టమని తెలుసు; తనకోసం యే త్యాగమైనా చేస్తాడని తెలుసు; అతని ప్రేమను త్రోసిపుచ్చటం న్యాయంకాదని తెలుసు కూడ. అయినా ఇదివరలో వుండే నిరాశ తిరిగి బయల్దేరింది. రావుసాహెబ్‌లో తాను చూడాలనుకొన్న గుణాలేవీ కనిపించలేదు నళినికి. మొగాళ్ళలో సహజంగా వుండే అహంభావము మాత్రము అతనిలో లేదు అందుకు సంతోషించింది. కాని అతనితో జీవితం సంపూర్ణంగా వుండదని అనుకున్నప్పుడల్లా విచారించేది. తాను జీవితంలో కల్పించుకున్న ఆశయాలు అతని ఊహకి చాలా దూరంలో వున్నట్టు తెలుసుకుంది. అంతే కాకుండా అవంటే అతనికి అంత యిష్టమున్నట్టు లేదని అర్థం అయిందామెకు. వాళ్ళ యిద్దరి జీవితాలకు ఆధారంగా ప్రేమ ఒక్కటే ఆమెకు కన్పించింది. కాని ప్రేమ అనేది మానవ జీవిత రంగంలో ఒక చిన్న తరంగం మాత్రమే. ఇతర అనుభవాలుంటాయి. వాటిలో కలయిక లేకపోతే అన్యోన్యం ఉండదనుకుంది. అతనితో ఓసారి అంది: 'మన అనుభవాల్లో భేదాలున్నప్పుడు అసహనం బయల్దేరదా?'

'అన్ని అనుభవాలకన్నా ప్రేమ గొప్పది. అదుంటేచాలు.'

ఆ విషయం అంతకన్నా చర్చించటానికి ఇష్టం లేకపోయింది అతనికి.

ఇదివరలో డాక్టరు స్త్రీ జాతిని అగౌరవపరంచాడు. ఇప్పుడితను తను ప్రేమించిన స్త్రీని అర్థం చేసుకోలేకపోయాడు. అర్థం చేసుకోవాలని అభిలాషకూడలేదు. జీవితంలో ఒక్క ఆనందంకోసం అతనికి వశమవటం ఆమె కిష్టం లేకపోయింది. ఏ పురుషుడుకూడ స్త్రీ తనకు అన్ని విధములా వశం కాకపోతే సహించలేడు. అతని నీడలో కప్పడిపోవుట ఆమె భరించలేదు. అతనామె హృదయంలోని అన్ని తంత్రులను ప్రమోగించలేకపోయాడు. ఇరువురూ సౌందర్యాన్ని అపేక్షించేవారే. కాని యితరంగా అపశ్రుతులు అనేకం ధ్వనించాయి. స్త్రీ పురుషులలో స్నేహభావానికి ఒక్క

ప్రేమ చాలదు. అతనిలోవున్నది ఆ ఒక్క వాంఛ మాత్రమే అది మొదలు వాళ్లిద్దరి మనసులు కలసివుండేవి కాని వారి దృక్పథాలు మాత్రం చీలి వుండేవి. ఈ సంగతి అతను గ్రహించ లేదు. ఆమెలో మార్పు మాత్రం ఆశ్చర్యాన్ని విషాదాన్ని కలిగించింది. అడగలేకపోయాడు కారణం. ఎలా అడగాలో తెలిసిందికూడా కాదు.

ఈమె మాత్రం నిశ్చయం చేసుకొన్నది. జీవితంలో రెండవ భగ్నప్రయత్నం పూర్తయింది. ఇంక కోరికోసం కాంక్షించదలచుకోలేదు. తను మాట్లాడకపోతే అతనికి నరకంలా వుంటుందని తెలిసినా అతనివైపు తిరిగి చూడలేదు. ఒక్కమాటైనా మాట్లాడలేదు.

ఇంక ఒక్కరోజు మాత్రమే అక్కడ వుంటుంది. అంతవరకు అనుకోని కలపు కలిగింది. అతనిని చివరసారి చూద్దామని వెళ్లింది. మెరుపు వాక మూసినట్లు చూశాడు. చాలా సంతోషంతో ఆహ్వానించాడు. ఇద్దరు కలిసి ఎంతో దూరం వెళ్లున్నారు అతని ఆశ్చర్యం యింకా తగ్గలేదు. కాని ప్రాధేయంగా చూస్తున్నాడు ఆమె కళ్ళలోకి అతని అమాయకత్వానికి ఆమె ఒక్కసారి పెదిమ విరిచింది.

ఆ మర్నాడే స్వగ్రామానికి బయల్దేరింది. ఎలా వచ్చిందో అలానే వెళ్లింది. కాని విచారం లేదామెకి. మగవాళ్లు మాత్రం యింకా ఎప్పటికి మారుతారా అనే ప్రశ్న ఆమెను వేధిస్తోంది.

# మహాభారతంలో మాస్కో ఆసక్తి

భీమవరపు రాధాకృష్ణ

మహాభారతాన్ని రష్యనుభాషలోకి అనువదించడానికి లెనిన్‌గ్రాడ్ విశ్వవిద్యాలయ ఆచార్యులొకరు పూనుకున్నట్లు ఈ మధ్య వార్త వచ్చింది. ఈ ఉత్కృష్టకార్యాన్ని మనం అభినందించాలి. వివిధదేశాల సంస్కృతులకూ నాగరికతలకూ అన్వయాన్ని కూర్చుకొంటూ, మానవజాతి పురోగమించవలసిన యీ రోజుల్లో వీరు ప్రారంభించిన కార్యం అట్టి ఆదర్శానికి ఓ దగ్గర త్రోవను చూపటం అవుతుంది. కాని—

రష్యా నేడు ఏ ఆదర్శాలతో ముందుకు పోతోంది? వారికి మతం అంటే "ఒకనల్లమందు". చర్చిలు లైబ్రరీలుగా రష్యాలో నేడు మారాయి. వీరి తత్వాన్ని ప్రబోధించేందుకే, రష్యాలో ప్రతిఅణువూ యిర్వైనాలుగు గంటలూ పనిచేస్తోంది.

ఇట్టి సమయంలో, ఆధ్యాత్మిక తత్వానికి బాగా అలవాటుపడి, దైవత్వంలో బాగా నమ్మకం ఉన్న మనకే అప్పుడప్పుడు విష్ణువుకు నాలుగు చేతులున్నాయా? బ్రహ్మకుమూడుతలలున్నాయా? దని అనుమానం వస్తుందే? ఈచారిత్రకపుచరిత్ర నేటి రష్యాకు ఎల్లా అభిరుచి కల్గించింది?

సాహిత్యాన్ని ప్రచారానికుపయోగించటం అనే మాట జ్ఞాపకం వస్తుంది. ఒకప్పుడు ఒక అమెరికన్ మిషనరీ ఏదోగ్రామంలో భగవద్గీతలోంచి ఒక శ్లోకాన్ని ఉదాహరిస్తున్నాడు. శ్రీ కృష్ణ భగవానుడు అర్జునుని "యుద్ధంచెయ్యి" అనిప్రబోధిస్తున్న శ్లోకమది. ఈ శ్లోకంనుంచి హిందూమతం అంతా యుద్ధాలే అనే సారాంశం తేల్చి, ఏసు ప్రభువు అహింసాతత్వాన్ని ఆయన బోధిస్తున్నాడు. అసలు అర్థం తెలియకుండా స్వలాభాపేక్షతో పరుల వాఙ్మయాన్ని ఉపయోగించటం ఇది—

ఇట్లే రాజకీయప్రచారానికి కాదుగదా మహాభారతాన్ని అనువదించటం అని అనుమానం రాక మానదు. దీనికి ఆధారం లేకుండాపోలేదు. షేక్స్పియరు 'హామ్లెటు' నాటకానికి రష్యాలో జరిగిన సంస్కరణ చూస్తే ఇది బుజువవుతుంది. మార్క్సిస్టు ఆదర్శాలకు సరిపోయేటట్లు దాన్ని అవకతవకగామార్చారని అలెగ్జాండర్ పూల్క్రాట్ వ్యాసం వ్రాశాడు.

మహాభారతానికి కూడా అదే సత్కారం జరగవచ్చు. మన జాతికంతకు అది మహోత్కృష్ట గ్రంథము. జాతివిశిష్టతను, నాగరికతను స్పష్టం చేస్తుంది. అట్టి ఉద్గ్రంథాన్ని ఏమైనా మారిస్తే జాతికంతకీ అవమానం. అట్టిది జరగకుండా చూడవలసిన బాధ్యత మన ప్రభుత్వంమీద వుంది.